

# భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలి

**ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం**

**సిరి న్యూస్‌టుడే, కాగజ్‌నగర్:**

నూతన ఆవిష్కరణలను తయారు చేసి విద్యార్థులు భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి అన్నా రు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల ఆధ్వర్యంలో విభిన్న శాస్త్రీయ ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలు, ప్రయోగాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సైన్స్ దినోత్సవం వంటి కార్యక్రమాలు విద్యార్థు ల్లో శాస్త్రీయ ఆలోచన, పరిశోధనా ధోరణి పెంపొందించేందుకు ఎంతో దోహద పడతా యని అన్నారు. బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. కెమిస్ట్రీ విభాగ లెక్చరర్ నేచురల్ కలర్స్ తయారీపై విద్యార్థులు ఆకర్షణీయమైన ప్రదర్శన చేశారని పేర్కొన్నారు. పూలు, మొక్కల నుంచి సహజ రసాయనాలను తీసి పర్యావరణానికి హాని లేకుండా ఎన్నో వర్ణాలు తయారు చేయవచ్చని వివరించారు. సహజ రంగులు మన చర్మానికి, పర్యావరణానికి హాని కలిగించవని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహ, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌన్సిల్ తొలి సమావేశంలో ప్రోటోకాల్ వివాదం



**సిరి న్యూస్‌టుడే, కాగజ్‌నగర్:**

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కొత్తగా ఎన్నికైన సభ్యులతో శనివారం తొలి కౌన్సిల్ సమావేశం నిర్వహించగా, ప్రోటోకాల్ వివాదం చెలరేగి ఉద్రిక్తత నెలకొంది. వైస్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన డాక్టర్‌కొత్తపల్లి అనితకు వేదికపై ప్రోటోకాల్ ప్రకారం సీటు కేటాయించలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆందోళన చేపట్టారు. సమావేశ వేదికపై తన హోదాకు తగిన స్థానం కల్పించాలని అనిత డిమాండ్ చేయగా, సీటింగ్ వ్యవస్థపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో వివాదం మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన 11 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలని, వైస్ చైర్‌పర్సన్ హోదాకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ ఘటన స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రోటోకాల్ అంశంపై అధికారఉ ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ఈ వివాదం మున్సిపల్ పాలనలో సమన్వయం అవసరాన్ని స్పష్టం చేస్తోంది.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**సిరి న్యూస్‌టుడే, తాండూర్:**

మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బోయపల్లి సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ అన్నారు. శనివారం బోయపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఉపాధ్యాయులు సుధ, సిబ్బంది ఉన్నారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**ఆదిలాబాద్ ఎంపీ జి నగేష్**






**సిరి న్యూస్‌టుడే, ఆదిలాబాద్:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గొడం నగేష్ అధికారులను ఆదేశిం చారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, పథకాల అమలుపై సుదీర్ఘ సమీక్ష చేపట్టారు. ప్రభుత్వ గ్రాంట్లు, నిధుల అంచనాలకు అనుగుణంగా అభివృద్ధి ప నులను రాబోయే 45 రోజుల్లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులకు సాగులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా చూడాలని ఆదేశించారు. ఫసల్‌బీమా యోజన, రాష్ట్రీ య కృషి వికాస్ యోజన అమలుపై ఆరా తీశారు. ప్రతి రైతుకూ సాయిల్ హెల్త్ కార్డులు అందేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. పశువైద్య సేవలు, ఉద్యానవన ప్రో త్సాహకాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలని, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మారుమూల ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద గరిష్ట పనిదినాలు కల్పించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద చేపట్టిన గ్రామీణ రోడ్డు పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలని, అర్హులైన వారందరికీ పెన్షన్లు అందేలా చూడాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో పీఎం జన్‌మన్ అమలును ప్రత్యేకంగా సమీక్షించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, జాతీయ రహదారుల నిర్మాణం, నిరంతర విద్యుత్ సరఫరా, రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకత వంటి అంశాలపై సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర ఆలయ చైర్మన్‌గా బండి వెంకటకృష్ణారెడ్డి

**సిరి న్యూస్‌టుడే, వేంసూర్:**

మండలంలోని కందుకూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన చైర్మన్‌గా బండి వెంకటకృష్ణారెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌కు, కమిటీ సభ్యులకు గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం తిరునాళ్ల ప్రారంభం కాగా, ఆదివారం రాత్రి 9.15 గంటలకు తిరుకళ్యాణం నిర్వహించనుండగా, ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ నూతన చైర్మన్, కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలినాకె. ఆలయ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు.



ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం కట్టుబడి పనిచేస్తానని నూతన చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రోత్సహించాలి

**టైలర్స్ డే, సైన్స్ ఫేర్‌లో ఎమ్మెల్యే**

**సిరి న్యూస్‌టుడే, సత్తుపల్లి:**

విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్ట రాగమయి దయానంద్ అన్నారు. గీతమ్స్ కాలేజీ రోడ్‌లోని కేపీఆర్ గౌతమ్ స్కూల్‌లో కౌన్సిలర్, స్కూల్ చైర్మన్ మందపాటి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన "సైన్స్ ఫేర్" కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నమూనాలను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. అలాగే సత్తుపల్లి పట్టణంలో "టైలర్స్ డే" సందర్భంగా టైలర్లతో కళా భారతి వేదికగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టైలర్ల సేవలు సమాజానికి ఎంతో అవసరమని, వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు, పాఠశాల సిబ్బంది, టైలర్స్ యూనియన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**సిరి న్యూస్‌టుడే, ఆదిలాబాద్:**

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 14 నుంచి ఏప్రిల్ 15 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 10,928 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, ఇందుకోసం 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల విధులకు సంబంధించి 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 52 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 13 మంది సి-కస్టోడియన్లను నియమించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు శాఖ ద్వారా 144 సెక్షన్ అమలు చేస్తూ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, అలాగే సమీపంలోని జిరాక్స్ సెంటర్లను పరీక్షా సమయంలో మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా పత్రాల రవాణాకు, ఫ్లయింగ్ స్క్వాడ్ల కోసం



తగిన వాహనాలను సిద్ధం చేయాలని రవాణా శాఖా అధికారులను ఆదేశించారు. వేసవి తీవ్రతను దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా అన్ని పరీక్షా కేంద్రాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ట్రాన్స్ కో అధికారులకు సూచించారు. విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా బస్సు వేళలను సర్దుబాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, ఆర్టీసీ, వైద్య, విద్యుత్, పోలీస్, రవాణా, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల బకాయిలపై బీజేపీ ఆందోళన

**హైదరాబాద్, మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**



హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద విశ్రాంత ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరుతూ చేపట్టిన నిరాహార దీక్షకు బీజేపీ నేతలు మద్దతు తెలిపారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి సోమవారం దీక్ష చేపట్టగా, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సహా పలువురు నేతలు పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేపీ శాసనసభ పక్షనేత మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అంజి రెడ్డి తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బెనిఫిట్స్ అందక మరణించిన విశ్రాంత ఉద్యోగుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. రిటైర్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని నేతలు డిమాండ్ చేశారు. ఉద్యోగుల నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం చట్టరీత్యా తప్పని మల్క కొమరయ్య పేర్కొన్నారు. రెండేళ్లుగా సమస్యలు పరిష్కారం కాలేదని, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన హక్కులను ఆలస్యం చేయడం సరికాదని విమర్శించారు. బాండ్ల ద్వారా అయినా నిధులు సమకూర్చి బకాయిలను తీర్చాలని సూచించారు. ఈ అంశాన్ని రాబోయే కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తుతామని హామీ ఇచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితులు లేవని, తెలంగాణలోనే ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేతలు వ్యాఖ్యానించారు. హెల్త్ పాలసీ పేరుతో జీతాల నుంచి కోత విధించడం సరికాదని, ముందుగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటామని తెలిపారు.



## ఘనంగా సంత్ రోహిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు

**భీంగల్, మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**

రోహిదాస్ సమాజ్ పంచాయత్ సంఘ్ ముంబై (రిజి) విభాగ్ సమితి నం:9 ఆధ్వర్యంలో సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ గారి 650వ జయంతి ఉత్సవం స్థానిక రోహిదాస్ (మాదిగ) ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రభాదేవి లోగల బాబాసాహెబ్ అంబేడ్కర్ నగర్ పరిసరంలోజయంతి వేడుకలు జర్పారు. ఆరంభంలో మహారాష్ట్ర ఆరాధ్య దైవం శివాజీ మహారాజ్, సంత్ రవిదాస్, డాక్టర్ అంబేడ్కర్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. తదుపరి అలీ బాగ్కర్ ప్రేమ్ వర్ధక్ వార్కరి సమాజ్ వారు కీర్తనలతో సభను ప్రారంభించారు. కార్యక్రమంలో రోహిదాస్ సమాజ్ పంచా యత్ సంఘ్ అధ్యక్షులు గుణాజీ కదం, ఉపాధ్యక్షులు అరుణ్ కొండ్విల్కర్, నారాయణ తివేకర్, సందీప్ కొండ్విల్కర్, తానాజీ కదం, సునందా చౌవన్, మంజుల కొండ్విల్కర్, రోహిణి చౌవన్, కల్పన దాస్గావ్కర్, ప్రగతి కొండ్విల్కర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ కు సన్మానం

**భీమ్‌గల్, మార్చి 2(సిరి న్యూస్ టుడే):**

ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ మామరి సందీప్ కు మోచి సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు.భీమ్‌గల్ పట్టణంలోని మున్సిపల్ ఎన్నికల్లో ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ గా గెలుపొందిన మామరి సందీప్ ను సోమవారం మండల మోచి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువా పూలమాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మోచి సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ..అతి చిన్న వయసులో కార్ డ్రైవర్ గా మున్సిపల్ ఎన్నికల బరిరో కౌన్సిలర్ గా పోటీ చేసి గెలుపొందడం చాలా సంతోషకరమని అన్నారు. రానున్న రోజుల్లో 8వార్డ్ కు అన్ని విధాలుగా సహకరించి అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే వార్డ్ కౌన్సిలర్ మాట్లాడుతూ..మీ అందరి సహాయ సహకార లక్ష్యంగా వార్డ్ కు అన్ని విధాలుగా తీర్చిదిదల కృషి చేస్తానని హామీ ఇస్తున్నాను.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మామరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి రాచర్ల గంగాధర్, సంఘం సభ్యులు గంగాధర్, విఠల్, జగదీష్, శివ కుమార్, సాగర్ సభ్యులు పాల్గొన్నారు.



## నార్సింగి మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శ

**చేగుంట/నార్సింగి మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**

మెదక్ జిల్లా, నార్సింగి మండలం, నార్సింగి మాజీ జెడ్పీటీసీ కృష్ణారెడ్డి మాతృమూర్తి దశదిన కర్మ కార్యక్రమం కొంపల్లిలోని వారి నివాసంలో నిర్వహించగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తూ వారిని ఓదార్చారు. ఇక్కడ పలువురు ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు ఉన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**

భీమారం మండల కేంద్రంలో ఏఎంసీ గోదాం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కృషితో ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.12.50 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మధుసూదన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా మారుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భీమారం సర్పంచ్ విజయలక్ష్మి, పున్నం చందు, పంచాయతీరాజ్ ఏఈ రాజకుమార్, గ్రామ కార్యదర్శి మల్లేష్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఊర చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయాలని, ధ్వంసమైన మత్తడి వద్ద సుంకరిపల్లి కాలనీ రాకపోకల కోసం హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని ఇరిగేషన్ డీఈ సునీతకు వినతిపత్రం అందజేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## సీబీఎస్సీ పాఠశాల పేరిట మోసాల పై ఫిర్యాదు

**నిజామాబాద్ జిల్లా, మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**



తెలంగాణ విద్యార్థి పరిషద్ నగర అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. నిజామాబాద్ జిల్లాలో సీబీఎస్సీ పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తూ, భవన నిర్మాణం పూర్తికాకముందే అడ్మిషన్లు ఇస్తూ, అనుమతులు లేకుండా విద్యా చట్టాలకు విరుద్ధంగా పనిచేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు సీబీఎస్సీ పేరుతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తూ, రోడ్లపై పెద్ద ఎత్తున హోర్డింగ్స్ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నాయని, భవనాలు పూర్తి కాకముందే వందలాది మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తున్నాయని చెప్పారు. ముఖ్యంగా నారాయణ సీబీఎస్సీ, చైతన్య సీబీఎస్సీ, అల్ఫోర్స్ సీబీఎస్సీ, వంటి సంస్థల పేర్లతో జిల్లాలో అనేక చోట్ల అనుమతులు లేకుండా బ్రాంచ్‌లు ప్రారంభించి విద్యా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి అక్రమాల వల్ల విద్యార్థుల భద్రత ప్రమాదంలో పడుతోందని, తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. కనీస మౌలిక వసతులు లేకుండానే అడ్మిషన్లు ఇస్తున్న యాజమాన్యాలపై తక్షణమే విచారణ జరిపించి, కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధు, సోనూ, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఇందల్వాయిలో హోలీ సంబరాలు



ఇందల్వాయి, మార్చి 2 (ప్రజాశంకరావం):



ఇందల్వాయిలో హోలీ పండుగ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పండుగ సందర్భంగా యువత శారీరక దారుఢ్యాన్ని ప్రదర్శించేందుకు నిర్వహించిన బలప్రదర్శన కార్యక్రమం ఆకట్టుకుంది. గ్రామానికి చెందిన యువకుడు లోకాని గోపి సుమారు 80 కేజీల బరువున్న గుండును సునాయాసంగా పైకి ఎత్తి తన అసాధారణ బలాన్ని చాటాడు. పండుగ వేళ ఏర్పాటు చేసిన ఈ విన్యాసాన్ని చూసేందుకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోపి గుండును ఎత్తిన సమయంలో ఈలలు, చప్పట్లతో ఉత్సాహపరిచారు. పాతకాలపు గ్రామీణ క్రీడలను గుర్తుచేస్తూ నేటి యువత కూడా ఇలాంటి విన్యాసాలు చేయడం సంతోషకరమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఇందల్వాయి యువత క్రమశిక్షణతో, ఆరోగ్యకరమైన పోటీతత్వంతో ముందుకు సాగడం గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు. లోకాని గోపిని గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.. అలాగే ఈ హోలీ వేడుకల్లో భాగంగా గ్రామస్తులందరూ రంగుల కేళిలో మునిగితేలారు. ఉదయం నుంచే చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## గ్రామపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం

**నిజామాబాద్ రూరల్, సిరికొండ, మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**

నిజామాబాద్ రూరల్ మండలంలోని సిరికొండ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఎంపీఓ తారాచంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపాలనలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం కొనసాగేందుకు రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలు, గ్రామంలో తాగునీటి సరఫరా రిజిస్టర్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, ఫండ్ రిజిస్టర్‌తో పాటు గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఇతర అన్ని రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రికార్డులు పరిశీలించడం తప్పనిసరిగా పాటిస్తున్నామని పేర్కొన్నారు. లెక్కలు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధి పనులు, నిధుల వినియోగం, పారిశుద్ధ్య కార్యక్రమాలపై స్పష్టమైన నమోదు ఉండాలని తెలిపారు. ఏ రికార్డులోనైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వహించడం సిబ్బంది బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజలకు అందించే సేవల్లో నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని ఎంపీఓ సూచించారు. కార్యక్రమంలో కారోబార్ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి వినీల్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధికి వారధులుగా నిలవాలి

**ఇందల్వాయి, మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**

గ్రామపంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, వారు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అనంతరావు పిలుపునిచ్చారు. సోమవారం ఇందల్వాయి లోని రైతువేదికలో నిర్వహించిన వార్డు సభ్యుల ప్రత్యేక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి గ్రామ సభల్లో గళం విప్పాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టంపై ప్రతి సభ్యుడికి పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. గ్రామ నిధుల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో పారదర్శకత పాటించాల్సిన బాధ్యత వార్డు సభ్యులపై ఉందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరవేయడంలో వార్డు సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో గూడాల పంపిణీ



**ఆర్మూర్, మార్చి 2 (సిరి న్యూస్ టుడే):**

ఆర్మూర్ పట్టణంలోని చిన్న బజార్ లోనీ లక్ష్మీనారాయణ మందిరంలో క్షత్రియ సమాజ్ తాత్కాలిక అధ్యక్ష కార్యదర్శులు రెడ్డి ప్రకాష్, బారడ్ గంగామోహన్ ఆధ్వర్యంలో సోమవారం క్షత్రియ కులస్తులకు 14 క్వింటాళ్ల అనుప గూడాలను పంపిణీ చేశారు. లక్ష్మీనారాయణ మందిరంలో ఉడికించిన గూడాలను మధ్యాహ్నం 3 గంటల నుంచి పంపిణీ ప్రారంభించారు. పట్టణంలోని క్షత్రియ కులస్తులందరూ వరుస క్రమంలో నిలబడి కౌంటర్ల వద్ద కుటుంబ సభ్యుల సంఖ్యను నమోదు చేసుకొని టోకెన్లు తీసుకున్నారు. మరో మూడు కౌంటర్లలో వరుస క్రమంలో టోకెన్లు ఇచ్చి గూడాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ తమ సమాజంలో 100 సంవత్సరాల నుంచి ఆనవాయితీగా హోలీ పండుగ సందర్భంగా గుడాలను పంపిణీ చేస్తారని చెప్పారు. ఆర్మూర్, పెర్కిట్ లోని క్షత్రియ కులస్తులందరూ తమ హక్కుగా భావించి సంఘానికి వచ్చి కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి గుడాలను తీసుకొని వెళ్తారన్నారు. వందల ఏళ్ల నుంచి వస్తున్న ఆచారాన్ని ప్రతి ఏడాది హోలీ పండుగ సందర్భంగా క్షత్రియులందరికీ గూడాలను పంపిణీ చేస్తామని చెప్పారు. ఏలాంటి పోలీస్ బందోబస్తు లేకుండా క్యూలైన్లలో నిలబడి క్షత్రియ కులస్తులు ప్రశాంతంగా గూడాలను తీసుకెళ్లడం మంచి సంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి కాందేశ్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు పడాల్ గణేష్, వైద్య సంజయ్, యువజన సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు సాత్ పుతే సంతోష్, దుమాని నీరజ్, కోశాధికారి కర్తన్ విశాల్, ఎన్నికల అధికారి ధమాంకర్ రవీందర్, అల్జాపూర్ చంద్రప్రకాష్, సభ్యులు బాదం రాజ్ కుమార్, బాదం రాజేందర్, సంతని విజయ్, బారడ్ కిషోర్, సాత్ పుతే శ్రీనివాస్, బొబిడే గంగా కిషన్, గటడి సత్యనారాయణ, సంతనీ అశోక్, కర్తన్ రవి, దొండి ఈశ్వర్, గటడి రాజేష్, మాణిక్ ప్రవీణ్, బారడ్ బాలాజీ, ఎస్ జి రాము, శ్రీను రాజేష్, కర్తన్ నవీన్ పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీ ఏర్పాటు



**ఉమ్మడి నిజామాబాద్, మార్చి 2 (సిరి న్యూస్ టుడే) :**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ ఉద్యమకారుల నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. ఉద్యమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం, జిల్లాలో సంస్థ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించడం లక్ష్యంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. కమిటీ చైర్మన్‌గా పుప్పల రవి, అధ్యక్షులుగా ఈ. శ్రీనివాస్ గౌడ్, కన్వీనర్‌గా పులి జైపాల్, ప్రధాన కార్యదర్శిగా సల్లా ప్రవీణ్, అధికార ప్రతినిధిగా గొల్లపల్లి రాజుగౌడ్ నియమితులయ్యారు. కో-కన్వీనర్లుగా సాయిరాం యాదవ్, అబ్బి ప్రగతి కుమార్, బరికుంట శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టనున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా భవానిపేట్ శ్రీనివాస్, నావాతే ప్రతాప్, లాల్ సింగ్, అనుపాల్ కిరణ్, యూసఫ్, రంజిత్ కుమార్ నియమితులయ్యారు. కార్యదర్శులుగా సౌందర్య, సిద్ధలక్ష్మి, మేత్రి రాజశేఖర్, జ్వాల రాణి ఎంపికయ్యారు. సలహాదారులుగా జమాల్పూర్ గణేష్, నరసింహ చారి, దాదన్నగారి విట్టల్ రావు, గైని గంగారం, ఆశ నారాయణ, రాజారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తెలంగాణ ఉద్యమ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

## ఐఎన్‌టీఎస్‌ఓ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

**కామారెడ్డి, మార్చి 2(సిరి న్యూస్ టుడే):**

కామారెడ్డి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఐఎన్‌టీఎస్‌ఓ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచి పలు బహుమతులను సొంతం చేసుకున్నారు. ఈ పరీక్ష ఫలితాల్లో గ్రాండ్ ప్రైజ్‌గా లెనోవా ల్యాప్‌టాప్‌ను విద్యార్థి అమ్ముల అభిరాం గెలుచుకున్నాడు. అతనికి గోల్డ్ మెడల్‌తో పాటు మెరిట్ సర్టిఫికేట్ కూడా అందజేశారు. పరీక్షల్లో భాగంగా రెండవ బహుమతిగా ఒకరు, మూడవ బహుమతిగా ఇద్దరు, నాలుగవ బహుమతిగా ఇద్దరు, ఐదవ బహుమతిగా నలుగురు విద్యార్థులు గోల్డ్ మెడల్స్ మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. అదేవిధంగా 57 మంది విద్యార్థులు కన్సోలేషన్ గోల్డ్ మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, 98 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్లు, మరో 7 మంది విద్యార్థులు స్పెషల్ ప్రైజ్ గోల్డ్ మెడల్స్ పొందారు. మొత్తంగా పాఠశాల విద్యార్థులు 173 బహుమతులను గెలుచుకుని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు భారీ స్థాయిలో బహుమతులు సాధించడం గర్వకారణమని తెలిపారు. ముఖ్యంగా అమ్ముల అభిరాం ల్యాప్‌టాప్ గెలుచుకోవడం పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రాజు, కోఆర్డినేటర్ మహిపాల్ రెడ్డి, డీన్ రాకేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ స్వామి, ప్రైమరీ ఒలంపియాడ్ ఇన్‌చార్జ్ హేమలతతో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

